59)నాదరామక్రియ/ఆనందభైరవి

ప॥ ఏమని నుతించవచ్చు యీతని ప్రతాపము। కామించి యీరేడు లోకములెల్లా నిండెను॥

చ॥ యీవల దేవుడు రథమెక్కితేను దైత్యులెల్ల। కావిరి జక్రవాళాద్రి కడ కెక్కిరి।
భావించి చక్రమీతడు పట్టితే నసురలెల్ల। ధావతి తోడుతను పాతాళము వట్టిరి॥

చ॥ గరుడధ్వజము హరి కట్టెదుర నెత్తించితే। పరువెత్తిరి దానవ బలమెల్లను।
గరిమ నితేరి బండికండ్లు గదలితేను। ఖరమైన దైత్యసేన క్రక్కదలి విరిగె॥

చ॥ ధృతి శ్రీవేంకటేశుడు తిరువీధులేగితేను। కుతిలాన శత్రులు దిక్కుల కేగిరి।
తతి నలమేల్మంగతో తన నగరు చొచ్చితే। సతమై బలిముఖ్యులు శరణము జొచ్చిరి॥